

సమస్యలపై వినతుల స్వీకరణ
పాడేరు ఐటీడీఏలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 75 వినతులను స్వీకరించారు. 8లో



బాధితులందరికీ నిత్యావసరాలు
వరద బాధితులందరికీ నిత్యావసరాలు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. 8లో



వ్యాధులు ప్రబలకుండా చర్యలు
వరద ముంపు ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జేసీ అభిషేక్‌గౌడ్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

నేడు ప్రాథమిక పాఠశాలలకు సెలవు

సాక్షి,పాడేరు: వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతో జిల్లాలోని అన్ని ప్రాథమిక పాఠశాలలకు ఈనెల 27వతేదీ శనివారం సెలవు ప్రకటిస్తున్నామని కలెక్టర్ దినేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.అలాగే చింతూరు డివిజన్‌లోని అన్ని విద్యా సంస్థలకు తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు సెలవులు కొనసాగిస్తున్నట్టు తెలిపారు.

జి.మాడుగుల పీహెచ్‌సీ తనిఖీ



జి.మాడుగుల పీహెచ్‌సీని పరిశీలిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

జి.మాడుగుల: స్థానిక పీహెచ్‌సీని శుక్రవారం రాత్రి పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తనిఖీ చేశారు. దీనిలో భాగంగా మందుల నిల్వలను పరిశీలించారు. ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ యూనిట్ భవనాన్ని ఆయన పరిశీలించారు. బర్త్ వెయింటింగ్ రూమ్‌ను సందర్శించారు. ఇక్కడ అందుతున్న వైద్యం, సదుపాయాల వివరాలను తెలుసుకున్నారు. తహసీల్దార్ నర్సమ్మ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశికాంత్ పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్లకు దరఖాస్తుల ఆహ్వానం

- డ్వామా పీడీ శివయ్య



మాట్లాడుతున్న డ్వామా పీడీ శివయ్య

పాడేరు : జిల్లాలో మినీ గోకులం షెడ్ల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డ్వామా పీడీ శివయ్య తెలిపారు. పట్టణంలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, వెటర్నరీ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 550 మినీ గోకులం షెడ్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఒక్కో మండలానికి 25 చొప్పున కేటాయించామని తెలిపారు. మినీ గోకులం షెడ్ల ఏర్పాటు చేసుకునే వారు ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, గ్రామ సభ తీర్మానం, బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలను సమీపంలో ఉన్న గ్రామ సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్లకు అందజేయాలని సూచించారు. డ్వామా అసిస్టెంట్ డైరెక్టర్ పి. చంద్రశేఖర్, వెటర్నరీ ఏడీ డాక్టర్ సీహెచ్. నర్సింహులు పాల్గొన్నారు.

జిల్లాలో 263.8 మిల్లీమీటర్ల వర్షపాతం

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 263.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముంచంగిపుట్టులో 74.4, పెదబయలులో 36.6, డుంబ్రిగుడలో27.6, పాడేరులో 24.4, హుకుంపేటలో 23, అరకులోయలో 12.6, జి.కె.వీధిలో 11.6, అనంతగిరిలో 10.8, చింతపల్లిలో 8.4, మారేడుమిల్లిలో 7.8, జి.మాడుగులలో 6.4, చింతూరులో 3.4, కూనవరంలో 2,వై.రామవరంలో 2.6, రాజవొమ్మంగిలో 2.6, కొయ్యూరులో 2.2, అడ్డతీగలలో 2.2, రంపచోడవరంలో 1.6, ఎటపాక 1.6, వీఆర్‌పురంలో 0.8, గంగవరంలో 0.8, దేవీపట్నంలో 0.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఇసుక స్టాక్ పాయింట్ల పరిశీలన



గుండాల ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

ఎటపాక: మండలంలోని గుండాల వద్ద ఉన్న రెండు ఇసుక స్టాక్ పాయింట్లను అభిషేక్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇసుక నిల్వలు, డిమాండ్, సరఫరా వివరాలను తెలుసుకున్నారు. ఎటువంటి అవకతవకలు లేకుండా అత్యంత పారదర్శకంగా ఇసుక సరఫరా చేయాలని ఆదేశించారు. రెండు యార్డుల్లో 1.65 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందని భూగర్భ గనుల శాఖ జిల్లా అధికారి రవికుమార్ తెలిపారు. ఇసుక కమిటీ నిర్ణయం మేరకు లోడింగ్,రవాణా తదితర చార్జీలు టన్నుకు రూ.3 వందలు చెల్లించాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు.

డిప్పలు ధరించి.. ప్రాణాలకు తెగించి..

మన్యంలో నేటికీ మారుమూల గ్రామాలకు సరైన రవాణా మార్గం లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వీరి అవస్థలు వర్ణనాతీతం. అత్యవసర పరిస్థితుల్లో నడుముకు నీటిలో తేలియాడే స్వభావం ఉన్న ఆనభ డిప్పలు, ప్లాస్టిక్ బాటిళ్లు కట్టుకుని వాగులు దాటాల్సిన దుస్థితిలో గిరిజనులున్నారు. అటువంటి గ్రామాలు ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లో ఇప్పటికీ ఉన్నాయి. పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణులకు సైతం ఆనభ డిప్పలు కట్టి గెడ్డలు, వాగులు దాటించి ఆస్పత్రికి తరలించిన సందర్భాలు అనేకం. పండు ముసలి నుంచి చిన్న పిల్లల వరకు అందరూ ఇలా సాహసం చేయాల్సిందే.

- వర్షాకాలంలో గెడ్డలు, వాగులు దాటేందుకు గిరిజనుల అవస్థలు
- ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లో తొమ్మిది గ్రామాలకు ఆనభ డిప్పలు, ప్లాస్టిక్ బాటిళ్లు ఆధారం
- అత్యవసర పరిస్థితుల్లో సాహసం చేయాల్సిందే



జామిగుడ గెడ్డను దాటేందుకు డిప్పలు కట్టుకుని సిద్ధంగా ఉన్న గుంజివాడ గిరిజనులు



జామిగుడ గెడ్డను డిప్పల సాయంతో దాటుతున్న అవతలి గ్రామాల గిరిజనులు

పెదబయలు/ముంచంగిపుట్టు: మండలాల్లో నేటికీ కొన్ని గిరిజన గ్రామాల గిరిజనులు దయనీయస్థితిలో కాలం గడుపుతున్నారు.గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించినప్పుడల్లా గ్రామాలకు పరిమితం అవుతున్న వీరు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి వాటిని దాటాల్సి వస్తోంది.

- ముంచంగిపుట్టు మండలంలో ఉబ్బెంగుల, దొరగుడ పెదబయలు మండలంలో జామిగుడ పంచాయతీలోని గుంజివాడ, తారాబు, చింతల వీధి, జడిగుడ, గబ్బర్ల, సరిగిగుడ, కొజ్జిరిగుడ గ్రామాల ప్రజలు ఏ చిన్న అవసరం వచ్చినా వర్షాకాలంలో గెడ్డలు, వాగులు దాటేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు.
- ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జామిగుడ గెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో ఈ పంచాయతీలోని ఏడు గ్రామాల ప్రజలు ఏ అవసరం వచ్చినా గెడ్డ దాటేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామాల్లో 1300 మంది జీవనం సాగిస్తున్నారు. వీరు పంచాయతీ కేంద్రానికి వచ్చేందుకు నడుముకు ఆనభ డిప్పలు, ప్లాస్టిక్ బాటిళ్లు కట్టుకుని గెడ్డను దాటుతున్నారు. ఈ సమయంలో వారు ఆనభ డిప్పలు/ప్లాస్టిక్ బాటిళ్లను గుత్తుగా సిద్ధం చేసుకుంటారు. ముందుగా బాగా ఈత వచ్చిన వ్యక్తి ఈదుకుంటూ వెళ్తుంటే అతని నడుముకు కట్టిన తాడును పట్టుకుని ఆనభ డిప్పలు ధరించిన వారు గెడ్డను దాటి అవతలి ఒడ్డుకు చేరుకుంటారు. గెడ్డ ఉధృతి తగ్గే వరకు ఈ ప్రయాణం తప్పనిసరి. గెడ్డదాటే వ్యక్తి బరువును బట్టి రెండు నుంచి మూడు గుత్తులు నడుముకు కడుతుంటారు.
- చిన్న పిల్లల విషయానికిస్తే గెడ్డ/వాగును దాటించడం చాలా భిన్నంగా ఉంటుంది. వారిని సిల్వర్ పాత్రలో కూర్చోబెట్టి పాత్ర తిరగబడకుండా ఇద్దరు వ్యక్తులు పట్టుకుని ఈదుకుంటూ దాటిస్తారు.

ఆనభ పాదుల నుంచి డిప్పలు సేకరణ..

ఇంటిపెరట్లోని పండించే ఆనభ పాదులనుంచి పక్వానికి వచ్చిన కాయలను సేకరించి ఎండబెట్టి భద్రపరుస్తారు. ప్రతీ ఇంట్లో సుమారు రెండు మూడు గుత్తులు (ఒకొక్క గుత్తికి మూడు నుంచి నాలుగు) ఉంటాయి. ఇవి నీటిలో తేలియాడే స్వభావం ఉన్నందున వీటిని వినియోగిస్తుంటారు.

- ముంచంగిపుట్టు మండలంలో లక్ష్మీపురం పంచాయతీలోని దొరగుడ, ఉబ్బెంగుల గిరిజనులు కూడా వర్షాకాలంలో నడుముకు డిప్పలు, ప్లాస్టిక్ బాటిళ్లు కట్టుకుని ఉబ్బెంగుల వాగు దాటుతుంటారు. ఈ సమయంలో వీరు రెండు జతల దుస్తులు సిద్ధం చేసుకుంటారు. ఒక జత ధరించి వాగు దాటుతారు. రెండో జతను అవతలి ఒడ్డుకు వెళ్లిన మార్చుకుంటారు. అక్కడినుంచి పంచాయతీ కేంద్రానికి వెళ్లి పనులు చూసుకుని వాగు వద్దకు వచ్చి మళ్లీ దుస్తులు మార్చుకుంటారు. ఉబ్బెంగులులో 35, దొరగుడలో 26 కుటుంబాలు ఉంటున్నాయి. ఈ వాగుపై వంతెన ప్రతిపాదన ఉన్నప్పటికీ ముందుకు సాగడం లేదు.

స్థల వివాదంతో..

పెదబయలు మండలంలోని జామిగుడ గ్రామ సమీపంలో గెడ్డపై 2021లో వంతెన నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2కోట్లు మంజూరు చేసింది. దీనికి అప్పటి ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అరకు ఎంపీ మాధవి, ప్రస్తుత ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర శంకుస్థాపన చేశారు. ఎర్త్ వర్క్ జరిగిన తరువాత స్థల వివాదం కారణంగా పనులు నిలిచిపోయాయి. అయితే ఇటీవల ఈ ప్రాంతాన్ని సందర్శించిన కలెక్టర్ దినేష్‌కుమార్ వర్షాలు తగ్గిన వెంటనే వంతెన పనులు ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో వంతెన పూర్తవుతుందన్న ఆశతో గెడ్డ అవతలి గ్రామాల గిరిజనులు ఉన్నారు.

ఉబ్బెంగుల వాగుతో ఇబ్బంది



నాపేరు లక్ష్మణ్, మాది మారుమూల దొరగుడ గ్రామం. ఏటా వర్షాకాలంలో నాలుగు నెలల పాటు గ్రామం చుట్టూ ఉబ్బెంగుల వాగు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆ సమయంలో నడుముకు ఆనభ డిప్పలు, ప్లాస్టిక్ బాటిళ్లు కట్టుకుని ప్రాణాలకు తెగించి దాటుతుంటాం. మా గ్రామాలకు వచ్చే ఉపాధ్యాయుడిని సైతం దగ్గరుండి వాగు దాటిస్తుంటాం.



సిల్వర్ పాత్రలో పిల్లలను దాటిస్తున్న ఈతగాళ్లు

వంతెన పనులు పూర్తి చేయాలి

జామిగుడ గెడ్డపై వంతెన పనులు నిలిచిపోవడం వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. దీనివల్ల ప్రభుత్వ సేవలు అందడం లేదు. రేషన్, పింఛను, వైద్యసేవలు, నిత్యావసరాల కోసం పంచాయతీ కేంద్రం జామిగుడ వెళ్లాలి. నాలుగేళ్ల క్రితం గెడ్డ దాటుతున్నప్పుడు ప్రమాదం జరగడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే గెడ్డను దాటుతున్నాం. తమ సమస్యను గుర్తించి వంతెన నిర్మాణం పూర్తి చేయాలి.

– తెరవాడ వెంకటరావు, గుంజివాడ

హామీలను విస్మరించిన

కూటమి ప్రభుత్వం

- అసెంబ్లీ సాక్షిగా తేటతెల్లం
- సూపర్ సిక్స్ అమలయ్యేదెప్పుడు?
- ప్రజలను మోసం చేసి అధికారంలోకి..
- అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి ధ్వజం



ముంచంగిపుట్టు: ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని విస్మరించి మాట తప్పిందని ఈ విషయం అసెంబ్లీ సాక్షిగా తేటతెల్లమైందని అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి శుక్రవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే వారందరికీ తల్లికి వందనం అమలు చేస్తామని, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పారని, ఇప్పుడు ఈ ఏడాది ఇవ్వలేం..వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తామనడం ప్రజలను మోసగించడమేనని విమర్శించారు. సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల్లో అమలుకాని హామీలను ఊదరగొట్టారని, అమలు చేయాల్సిన సమయం వచ్చేసరికి నేడు, రేపు, ఎల్లుండి అంటూ వాయిదాలు వేస్తున్నారన్నారు. బూటకపు హామీలతో అధికారం దక్కించుకున్న కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. ఇలా హామీలను విస్మరించి పాలన సాగిస్తుందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తూచ తప్పకుండా ఇచ్చిన హామీలను అమలుచేసిన మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా అమలుచేయాలని డిమాండ్ చేశారు. నమ్మిన ప్రజలను మోసగించడం టీడీపీ ప్రభుత్వానికి వెన్నతో పెట్టిన విద్య అని ఎంపీ విమర్శించారు.

సాయం కోసం కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయండి

అరకులోయ రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేష్ తెలిపారు. సహాయం, సమాచారం పొందేందుకు ఏవో ఉదయ్‌భాస్కర్: 7382190251, సీహెచ్ ఆంజనేయశర్మ: 9347039248, శేషగిరి: 9703313138 నంబర్లకు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చండి బాబూ..

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి



సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికలలో చంద్రబాబుతో పాటు కూటమి నేతలంతా ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే నెరవేర్చాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు,మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అమలుకాని అనేక హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం వాటిలో ఒక్కటి కూడా అమలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఏర్పడి 50రోజులు దాటినప్పటికీ హామీల అమలులో ఎటువంటి చలనం లేదన్నారు. తల్లికి వందనం పేరిట బడికి వెళ్లే ప్రతి బిడ్డకు రూ.15వేలు చెల్లిస్తామని ప్రకటించిన చంద్రబాబు అమలుచేయకుండా మోసం చేశారని విమర్శించారు. వచ్చే ఏడాది నుంచి అమలుజేస్తామని మంత్రి లోకేష్ అసెంబ్లీలో ప్రకటించడం అన్యాయమన్నారు. రైతులకు ఏడాదికి రూ.20వేల సాయం ప్రకటించారని వ్యవసాయ సీజన్‌లో కూడా ఇవ్వకపోతే ఎలా అని ఆమె ప్రశ్నించారు. మహిళలకు ప్రతి నెలా రూ.1500, యువతకు నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి, 20లక్షల ఉద్యోగాల భర్తీ, ఏడాదిలో ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సూపర్ సిక్స్ హామీలన్నీ ప్రకటనలకే పరిమితం బాధాకరమన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఉసెత్తని ప్రభుత్వ పెద్దలు అమరావతికి రూ.15 వేల కోట్లు కేంద్ర సాయం అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని,అది ఏమాత్రం సాయం కాదని,అప్పు అన్న సంగతి తెలుసుకోవాలని భాగ్యలక్ష్మి సూచించారు.

200 గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

- పాడేరు డివిజన్‌లో విస్తారంగా వర్షాలు
- కూలుతున్న చెట్లు, దెబ్బతిన్న ఇళ్లు



కుంతుర్లలో ఇంటిపై కూలిన చెట్టు



గంపరాయి బ్రిడ్జి వద్ద ఉధృతంగా మత్స్యగెడ్డ



పాడేరు మండలం మర్రిపాలెంలో కూలిన ఇల్లు

సాక్షి,పాడేరు: మన్యంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, గెడ్డలు పొంగిప్రవహిస్తుండటంతో పాడేరు డివిజన్ పరిధిలో మారుమూల ప్రాంతాలకు చెందిన సుమారు 200 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మొన్నటి నుంచి భారీగా కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల చెట్లు కూలగా ఇళ్లు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వర్షాలు కాస్త తెరిపివ్వడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌తోపాటు అన్ని మండలాల్లో కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశారు. శబరి, గోదావరి నదుల ఉధృతితో చింతూరు డివిజన్ పరిధిలోని వరద ముంపు గ్రామాల్లో సహాయక కార్యక్రమాలను కలెక్టర్ దినేష్‌కుమార్, ఇతర అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

- జీకేవీధి మండలంలోని పెబ్బంపల్లి, చింతపల్లి మండలంలోని బలపం పంచాయతీ చెరువూరు, జి.మాడుగుల మండలంలోని కుంబిడిసింగి రోడ్డులోని మత్స్యగెడ్డ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అంతేకాకుండా పాడేరు-పెదబయలు మండలాల సరిహద్దులోని పరదానిపుట్టు కాజ్‌వేపై మత్స్యగెడ్డతో పాటు ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లోని మారుమూల ప్రాంతాలలో గెడ్డల్లో వరద ప్రవాహం ఎక్కువగా ఉంది. దీంతో వందలాది గ్రామాలకు రాకపోకలు స్తంభించడంతో గిరిజనులు ఇళ్లకు పరిమితమయ్యారు.

తగ్గుతూ.. పెరుగుతున్న శబరి



వరదనీటిలో విద్యుత్ లైన్లకు మరమ్మతులు



పడవపై వెళుతున్న ముకునూరు వాసులు



చట్టి వద్ద వరదనీటిలో జాతీయ రహదారి

ఇప్పటికీ జల దిగ్బంధంలోనే రహదారులు

చింతూరు: కొంచెం తగ్గుతూ కొంచెం పెరుగుతూ శబరినది దోబూచులాడుతోంది. గురువారం రాత్రికి చింతూరు మండలంలో తగ్గుముఖం పట్టిన శబరినది శుక్రవారం ఉదయం పెరిగి మధ్యాహ్నం నుంచి మళ్లీ తగ్గడం ప్రారంభించింది. దిగువనున్న గోదావరి తిరిగి పెరుగుతున్న నేపథ్యంలో శబరినది కూడా మళ్లీ పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు మండలంలోని చట్టివద్ద జాతీయ రహదారి–30పై గురువారం పూర్తిగా తగ్గిన వరదనీరు శుక్రవారం తిరిగి స్వల్పంగా చేరడంతో కాసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం నుంచి వరద తగ్గడంతో తెలంగాణకు రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి. చింతూరు, కల్లేరు నడుమ కుయిగూరు వాగు వరదనీరు రహదారిపైనే నిలిచి ఉన్నందున ఆంధ్రా, ఒడిశా మధ్య రాకపోకలు ప్రారంభం కాలేదు.సోకిలేరు, జల్లివారిగూడెం, చంద్రవంక, చీకటివాగుల వరద కారణంగా చింతూరు, వీఆర్‌పురం మండలాల మధ్య, చింతూరు మండలంలోని 25 గ్రామాలకు ఇంకా రాకపోకలు ప్రారంభం కాలేదు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు నాటు పడవల ద్వారా రాకపోకలు కొనసాగిస్తున్నారు. మండలంలోని ఉలుమూరు, మల్లెతోట గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో విద్యుత్ సిబ్బంది వరద నీటిలోనే పడవపై వెళ్లి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించారు.

విద్యుత్ సిబ్బంది సాహసం

- వాగుమీదుగా వైర్లపై నడిచి వెళ్లి సరఫరా పునరుద్ధరణ



మారేడుమిల్లి : వరద ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది సాహసం చేశారు. దీనిలో భాగంగా వారు శుక్రవారం మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న నూరుపూడి వాగును దాటి అవతల ఉన్న నూరుపూడి గ్రామానికి చేరుకుని సేవలందించారు. రాజమహేంద్రవరం ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి ఆదేశాల మేరకు స్థానిక ఏఈ శ్రీనివాస్ పర్యవేక్షణలో విద్యుత్ సిబ్బంది కూర రామయ్య, నీలన్నదొర నూరుపూడి వాగుపై ఇవతలి నుంచి అవతలి వైపునకు వెళ్లేందుకు స్థానికుల సహకారంతో భారీ చెట్ల మధ్య రెండు లైన్ల మేర విద్యుత్ వైర్లను ఏర్పాటుచేశారు. వాటి ఆధారంగా వారిద్దరు వాగు దాటి నూరుపూడి గ్రామానికి చేరుకున్నారు. విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. వారిని సున్నంపాడు సర్పంచ్ లచ్చిరెడ్డి అభినందించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ఎటపాక: గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని మురుమూరు, నందిగామ, గౌరిదేవిపేట ముంపు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలతో పాటు ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి మందులు అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. తమకు నిత్యావసరాలు, కూరగాయలు ఇవ్వాలని, వరదల సమయంలో రహదారి సౌకర్యం కూడా లేక ఇబ్బందులు పడుతున్నామని తమ గ్రామాన్ని ముంపు జాబితాలో చేర్చాలని గన్నేరుకొయ్యపాడు వాసులు జేసీని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో మురళీకృష్ణ, ఎంఈవో సరియం రాజులు, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, వీఆర్వో కన్నమ్మ, బొల్లా పుల్లయ్య పాల్గొన్నారు.

బోసిపోయిన పర్యాటక ప్రాంతాలు



సందడిలేని అరకు మ్యూజియం ముఖద్వారం

అరకులోయ రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పర్యాటక ప్రాంతాలు బోసిపోయాయి. వర్షాలు కురుస్తుండడంతో అరకులోయ అందాలు తిలకించేందుకు తస్తున్న పర్యాటకుల సంఖ్య తగ్గింది. దీంతో అరకులోయలోని పద్మాపురం గార్డెన్స్, మ్యూజియం, రణజిల్లెడ జలపాతం తదితర పర్యాటక ప్రాంతాలు వెలవెలబోయాయి.

వరద ముంపు గ్రామాల్లో పీవో పర్యటన

- దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల పరిశీలన
- అండంగిసింగి కాజ్‌వే హై లెవెల్ వంతెనకు ప్రతిపాదనలు

జి.మాడుగుల: మండలంలో అండగిసింగి కాజ్‌వే హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని ఇంజినీరింగ్ అధికారులను పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. జి.మాడుగుల మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. మెట్టపాడు వాగును ఆయన పరిశీలించారు. తియ్యమామిడి నుంచి మెట్టపాడు వరకు బిటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని ఆయన సూచించారు. పెదలోచలి గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న లోచలి మహేష్ ఇంటిని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న ఇళ్ల సమాచారం అందిస్తే నిబంధనల ప్రకారం పరిహారం అందిస్తామని ఆయన చెప్పారు.

రోడ్డు, కల్వర్టు నిర్మాణాలకు నిధులు

అనంతరం పెదలోచలి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలను ఆయన బోధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.ధర్మేంద్ర విద్యార్థులకు పాఠాలు బోధించడం లేనట్టు తెలుసుకున్నారు. పాఠశాలలో 138 మంది విద్యార్థులకు గాను 94 మంది హాజరు కావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ హెచ్ఎంకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. రాసవీధి జంక్షన్ వద్ద కిల్లంకోట మార్గంలో కొట్టుకుపోయిన కల్వర్టు ఆయన పరిశీలించారు. బొయితిలి నుండి కురిడేలు గ్రామం వరకు నిర్మిస్తున్న బిటీ రోడ్డుకు రూ.1.60కోట్ల నిధులు మంజూరు చేస్తామన్నారు. రహదారుల ఏర్పాటుతో కల్వర్టులు నిర్మాణాలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా తోకగరువు గ్రామం వద్ద కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని, ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారిని ఆయన ఆదేశించారు. బొంజంగి కల్వర్టు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. రహదారులు, కల్వర్టుల నిర్మాణాల్లో ప్రతిష్ఠమైన నాణ్యతను పాటించి, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని పీవో ఆదేశించారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీఈ అనుదీప్, ఏఈ దుర్గాప్రసాద్, మండల ఇంజనీరింగ్ అధికారి, పీఆర్ ఏఈ మాణిక్యం, తహసీల్దార్ నర్సమ్మ, ఈవోపీఆర్డీ డేవిడ్, ఏవో వీరభద్రరావు తదితరులున్నారు.



రాసవీధి జంక్షన్ వద్ద కొట్టుకుపోయిన కల్వర్టును పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

బాధితులందరికీ నిత్యావసరాలు

కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు: వరద బాధితులందరికీ నిత్యావసరాలు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. వరదలపై శుక్రవారం ఆయన రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో నోడల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరద బాధితులందరికీ రేషన్, నిత్యావసరాలు, టార్పాలిన్లు, దోమతెరలు, కిరోసిన్, టార్చ్‌లైట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారిని గుర్తించి వెంటనే అందించాలని, వివాహమైన నూతన దంపతులకు రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా సాయం అందించాలని ఆయన ఆదేశించారు. గోదావరి నీటిమట్టం తిరిగి పెరుగుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామస్థాయి కమిటీలను కూడా అప్రమత్తం చేయాలని ఆయన ఆదేశించారు. వరదసాయం పంపిణీకి సంబంధించి అదనంగా సరకులు కావాల్సివస్తే వెంటనే రప్పించాలని, సరకులు అందలేదనే ఫిర్యాదులు రాకూడదని, అలాంటి ఫిర్యాదులు వస్తే సంబంధిత తహసీల్దార్లు విచారణ జరిపి నివేదిక ఇస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవోలు సూరజ్ ధనుంజయ్ గనోరే, కావూరి చైతన్య, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలపై వినతుల స్వీకరణ

పాడేరు : స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 75 వినతులను పీవో వి. అభిషేక్ స్వీకరించారు. తన ఇంటి స్థలంలో గిరిజనేతరుడు అక్రమంగా ఇల్లు నిర్మించుకుంటున్నారని అడిగితే భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చింతపల్లికి చెందిన కాగి వెంకయమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై గతంలో మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదని వివరించింది. భారీ వర్షాల కారణంగా తన ఇల్లు కూలిపోయిందని, ఈ మేరకు నష్టపరిహారం ఇవ్వాలని హుకుంపేట మండలం అడ్డుమండకు చెందిన డి.దేముడమ్మ అందజేసింది. తాను సాగు చేస్తున్న పది సెంట్ల బంజారు భూమిలో చింతపల్లి మండలం బెన్నవరం గ్రామానికి చెందిన ఉల్లి జయరాజు అనే వ్యక్తి దౌర్జన్యంగా లాక్కున్నాడని జి.మాడుగుల మండలం కొలుంబొర్ర మహాదేవాపురానికి చెందిన చెందిన ఎం. రామచంద్రపాత్రుడు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులు స్వయంగా పరిశీలించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో బి.పద్మావతి, ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్ రావు, వెంకటేశ్వరరావు, టీడబ్ల్యూ డీడీ కొండలరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, హార్టికల్చర్ ఆఫీసర్ రమేష్‌కుమార్, జిల్లా కార్మిక శాఖ అధికారి సుజాత, జిల్లా రవాణ శాఖ అధికారి లీలాప్రసాద్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

ముంపు గ్రామాలను బోటుపై సందర్శించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



వరద ముంపు గ్రామం శ్రీరామగిరికి బోటుపై వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వీఆర్ పురం: విలీన మండలాల్లోని వరద బాధితులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు,రాష్ట్ర నాయకుడు మాచర్ల గంగులు అన్నారు. రేఖపల్లిలోని వరద బాధితుల పునరావాస కేంద్రం, వరద ముంపు గ్రామం శ్రీరామగిరిలో పార్టీ శ్రేణులతో కలిసి వారు శుక్రవారం పర్యటించి బాధితులతో మాట్లాడారు. పునరావాస కేంద్రాల్లో గుడారాలు వేసుకొని తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, గతప్రభుత్వ హయాంలోనే అన్ని సక్రమంగా అందేవని వడ్డిగూడెం కాలనీ వాసులు చెప్పారు. అనంతరం బోట్ ద్వారా ముంపు గ్రామం శ్రీరామగిరి చేరుకొని వరద బాధితులను పరామర్శించారు, ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు మాట్లాడుతూ వరద బాధితులకు టార్పాలిన్లు, దోమతెరలు, నిత్యావసర సరకులు, అందించాలని, వీఆర్ పురం మండలాన్ని వరద మండలంగా గుర్తించి వరద బాధితులందరికి తక్షణ సహాయంగా రూ.5 వేలు ప్రతీ రేషన్ కార్డుదారుడుకి అందచేయాలన్నారు. అరకు పార్లమెంట్ కార్యదర్శి బొడ్డు సత్యనారాయణ, మండల వైస్ ప్రెసిడెంట్ చిక్కాల బాలు, నాయకులు ముత్యాల గౌతమ్, చీమల కాంతారావు, రేవు బాలరాజు,మోడెం నరేష్,ముత్యాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా ధారాలమ్మ తల్లి

- అలంకరించిన భక్తులు



శాకంబరి అలంకరణలో ధారాలమ్మ తల్లి

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం ధారాలమ్మ అమ్మవారిని శాకంబరిగా శుక్రవారం కూరగాయలతో అలంకరించారు. ప్రతీ ఏటా ఆషాఢమాసంలో అలంకరించడం అనవాయితీ.దీనిలో భాగంగా శుక్రవారం ధారకొండకు చెందిన శ్రీనివాసరావు, లక్ష్మి దంపతులు, పోలవరానికి చెందిన వి.చిన్నా, లోవలక్ష్మి దంపతులు అమ్మవారిని శాకాంబరిదేవిగా అలంకరించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

తెగుళ్ల నివారణకు సూచనలు



పొలంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏవో ఉమాదేవి



పెదవలసలో రైతుల పంటలను పరిశీలిస్తున్న చింతపల్లి శాస్త్రవేత్తలు

కొయ్యూరు: వరి నారు కట్టల చివర్లను తుంచి వేస్తే కాండం తొలిచే పురుగును నివారించవచ్చని వ్యవసాయ అధికారి ఉమాదేవి సూచించారు.ఆమె శుక్రవరం రేవళ్లలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.ఆమె పొలం వద్దకు వెళ్లి రైతులకు అవగాహన కల్పించారు.ఆమె మాట్లాడుతూ నారు వేళ్లను సుడోమోనాజ్ ద్రావణంలో ముంచి నాట్లు వేస్తే వేరు ద్వారా వచ్చే వ్యాధులను తగ్గించవచ్చని చెప్పారు. తక్కువ పెట్టుబడితోమ ఎక్కువ లాబాలు ఎలా ఆర్జించాలో పలు మెలకువలను రైతులకు వివరించారు. ప్రతీ రెండుమీటర్లకు 20 సెంటీమీటర్ల కాలిబాటను వదలాలన్నారు. దీంతో దోమపోటు ఉధృతి తగ్గుతుందన్నారు. దీంతోపాటు సస్యరక్షణ ఎరువులు వేసేందుకు వీలుకలుగుతుందని చెప్పారు.దీనిలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నీటి ముంపునకు గురికాకుండా చూసుకోవాలి

గూడెంకొత్తవీధి: అధికంగా కురుస్తున్న వర్షాల కారణంగా గిరిజన రైతులు వారి పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ బయ్యపు రెడ్డి, డాక్టర్ బాల హుస్సేన్ రెడ్డిలు అన్నారు. మండల వ్యవసాయాధికారి మధుసూధనావుతో కలిసి శాస్త్రవేత్తల బృదం శుక్రవారం మండలంలోని పెదవలస, సంకాడ, లక్కవరపేట , దేవరాపల్లి పంచాయతీల్లోని పలు గ్రామాల్లో పర్యటించారు. రైతుల పంటలను పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు.

చింతపల్లిరూరల్: మండలంలో లంబసింగి గ్రామంలో చింతపల్లి వ్యవసాయాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటను బట్టి ప్రభుత్వం నిర్ణయించిన కనీస ప్రిమియం చెల్లించి ఈ పథకంలో నమోదు కావచ్చన్నారు. ఈ పథకంలో చేరిన రైతులుకు ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన పంట దిగుబడులపై బీమా పొందవచ్చాన్నారు. అనంతరం పలు గ్రామాల్లో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌ల సహయంతో వరి నాట్లు, కాలిబాటలు,సూడో మోనస్‌తో నారు శుద్ధి వంటి విషయాలపై వీహెచ్ఏ శంకరరావు అవగాహన కల్పించారు. ఎంపీటీసీ రావుల నూకరాజు,వీఆర్వో భారతీ,తదితరులు పాల్గోన్నారు.

భార్యను కడతేర్చిన భర్త



హత్యకు గురైన జానకి

చింతపల్లి రూరల్: భార్యను భర్త హత్య చేసిన ఘటన మండలంలో లోతుగెడ్డ పంచాయతీ తురుతుంపాడులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ రమేష్ శుక్రవారం అందించిన వివరాల మేరకు... తురుతుంపాడు గ్రామానికి చెందిన కోర్ర రవి చింతలూరుకు చెందిన జానకిని 2021లో వివాహం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో గత నెల పాడేరు జాతరలో భర్త రవి పిసిరిమామిడి గ్రామానికి చెందిన అమ్మాయితో చెట్టాపట్టాలేసుకుని తిరగడం భార్య జానకి (22) చూసింది. అప్పటి నుంచి వారి మధ్య వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో అతడితో తరుచూ గొడవ పడుతుండేది. గురువారం ఇదే విషయమై ఇంటికి వచ్చిన రవిని భార్య నిలదీసింది. ఎక్కడికెళ్లి వచ్చావని గొడవ పడింది. దీంతో కోపోద్రిక్తుడైన అతడు మధ్యాహ్నం 12 గంటల సమయంలో తలగడతో ఆమె మొహం మీద నొక్కి చంపేశాడు. ఆపై ఉరేసుకుని చనిపోయినట్లుగా చిత్రీకరించాడు. ఈ విషయాన్ని జానకి తల్లిదండ్రులకు తెలియజేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న మృతురాలి తండ్రి దాసు అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పంచనామా నిర్వహించి, నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతురాలికి రెండు సంవత్సరాల పాప ఉంది.

బూటకపు హామీలతో మోసం

- కూటమి ప్రభుత్వానికి ప్రజల గుణపాఠం తప్పదు
- వైఎస్సార్ సీపీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్



అరకులోయ రూరల్: తల్లికి వందనం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు తీవ్ర మోసం చేసిందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎల్‌బీ కిరణ్‌కుమార్ విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఉమ్మడిగా హామీలిచ్చి ప్రజలకు నామాలు పెట్టారన్నారు. ఇచ్చిన హామీలు ఏమాత్రం అమలు చేయకుండా కక్ష రాజకీయాలకు తెరలేపారని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా అడుగడుగున దాడులు, హత్యా రాజకీయలకే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఆరోపించారు. ప్రతి విద్యార్థికి రూ.15వేలు, ప్రతి ఇంటికి ఉచిత మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర హామీలను నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజలను నట్టేట ముంచారన్నారు. ఎన్నికుట్రలు చేసినా భవిష్యత్తులో జగనన్న ప్రభుత్వమే వస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల వ్యతిరేకత ఆరంభం మాత్రమేనని.. రాబోయే రోజుల్లో వారి ఆగ్రహం తప్పదని ఆయన ధ్వజమెత్తారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు

- ఆర్‌జేడీ చిన్మయిదేవి



గంగవరం సీడీపీవో కార్యాలయంలో సమీక్షిస్తున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

గంగవరం : అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని మాతా శిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె స్థానిక ఐసీడీఎస్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. దీనిలో భాగంగా రికార్డులను పరిశీలించారు. ప్రాజెక్ట్ పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలపై ఆమె సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకులు నాణ్యతగా ఉండాలని ఆదేశించారు. సీడీపీవో, సూపర్‌వైజర్లు తరచూ కేంద్రాలను పరిశీలించాలని సూచించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆమె నిల్వలు, హాజరును పరిశీలించారు. సీడీపీవో సీహెచ్ లక్ష్మి, సూపర్‌వైజర్లు సత్యవతి, జయలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

అడ్డతీగల: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ 2024-25 పరీక్ష రాయడానికి ఎనిమిదో తరగతి చదువుకుంటున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈవో పి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేయదలచిన విద్యార్థులు తమ పేరు, పుట్టిన తేది ,తండ్రి పేరు తదితర వివరాలను పాఠశాల రికార్డులతో పాటు ఆధార్‌కార్డులో సక్రమంగా ఉన్నట్టు చూసుకోవాలని సూచించారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థి బ్యాంక్ ఖాతాకు నిధులు జమ అవుతాయన్నారు. స్కాలర్‌షిప్ దరఖాస్తుకు అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, మరిన్ని వివరాలకు పాఠశాలల్లో సంప్రదించాలని సూచించారు.

31న పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

సాక్షి,పాడేరు: స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లను నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు, నాలుగు నుంచి 10వ తరగతి స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రాలు, పాలిసెట్-24 ర్యాంకు కార్డుతో స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలని సూచించారు. సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లో బీసీ-1, ఎస్సీ-2, ఎస్టీ-1, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లో బీసీ-3, ఎస్సీ -4, ఎస్టీ-18, మెకానికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లో బీసీ-3, ఎస్సీ-3,ఎస్టీ-21 సీట్లు ఖాళీలున్నాయని అర్హులైన అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్పాట్ అడ్మిషన్లు ఉదయం 9గంటల నుంచి జరుగుతాయని పేర్కొనానరు. ఈ అడ్మిషన్లలో సీటు పొందిన వారు రూ.5,800 ఫీజు వెంటనే చెల్లించాల్సి ఉంటుందని, ఎలాంటి రాయితీలు ఉండవని ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు.

రైతుల ఉత్పత్తిదారుల సంఘాలతోనే ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న హైపర్ ఇంటర్నేషనల్ సంస్థ అధినేత బెన్నీ

రంపచోడవరం: రైతుల ఉత్పత్తిదారుల సంఘాల ద్వారానే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని హైపర్ ఇంటర్నేషనల్ సంస్థ ఉభయ రాష్ట్రాల అధినేత డాక్టర్ బెన్నీ తెలిపారు. నవజీవన్ ఆర్గనేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల అభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బెన్నీ మాట్లాడుతూ రాత్రిపగలు రైతులు వ్యయప్రయాసలు పడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వారిలో మార్పు రావాలంటే రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం కావాలని, తద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం హార్టికల్చర్ అధికారి చిట్టిబాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఎక్కువగా పండించే జీడిమామిడి పంటను ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా అమ్మవచ్చన్నారు. అగ్రికల్చర్ ఏడీఏ చౌదరి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అన్నదాత సుఖీభవ పథకంలో 90 శాతం రైతులతో విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. పంట కొనుగోలు కేంద్రంలో అమ్మాలని, ఈ క్రాప్ట్ రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. నవజీవన్ ఆర్గనేషన్ అధ్యక్షుడు కె. సహదేవయ్య, సలహాదారు నీలయ్య, పశువర్ధక శాఖ డాక్టర్ రిక్కి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరి, కేవీకే సైంటిస్ట్ ఆదర్శ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ టి. జోసఫ్, సిబ్బంది నాగేశ్వరరావు, బాబూరావు, సత్తిబాబు పాల్గొన్నారు.

గురువులకు తప్పని అవస్థలు

గూడెంకొత్తవీధి: సెల్ సిగ్నల్స్ సక్రమంగా లేకపోవడంతో ఉపాధ్యాయులు ముఖ హాజరుకోసం అవస్థలు పడుతున్నారు. గూడెంకొత్తవీధి కాలనీ వద్ద ఏపీగురుకుల బాలికల జూనియర్ కళాశాల ఉంది. ఇక్కడ సరిగ్గా సెల్‌సంకేతా లుండటం లేదు. దీంతో ముఖ హాజరు నమోదు కాక అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. సిగ్నల్స్ కోసం పరిసర ప్రాంతాలకు వెళ్లి నిరీక్షించాల్సి వస్తోందని వారు చెబుతున్నారు.అధికారులు సెల్‌సంకేతాలు సక్రమంగా వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

ఐఐటీ చదువుకు పేదరికం అడ్డంకి

- ఆర్థిక స్థోమత లేక దిగాలు
- ఆదుకోవాలని గిరిజన విద్యార్థుల వేడుకోలు



ధన్‌బాద్ ఐఐటీలో సీటు సాధించిన అదీప్‌తేజ్



ధార్వాడ్ ఐఐటీలో సీటు సాధించిన దారేశ్వర్

పాడేరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన తోడ్పాటుతో ఎంతో కష్టపడి చదువుకుని ప్రఖ్యాత విద్యా సంస్థల్లో ఐఐటీ సీట్లు సంపాదించారు. ఇంతలో ప్రభుత్వం మారడం, ఉన్నత చదువులు చదువుకుందామంటే ఓ వైపు పేదరికం వెక్కిరిస్తుండటంతో పాడేరు మండలానికి చెందిన ఇద్దరు గిరిజన విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు.

పాడేరు మండలం జి.ముంచంగిపుట్టు గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి తలమరి అదీప్‌తేజ్ తన గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం చేశాడు. 2022లో విశాఖపట్నంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివి 545 మార్కులతో పాసయ్యాడు. గుంటూరు జిల్లా పల్నాడులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో ఇంటర్ చదివి 931 మార్కులు సాధించాడు. జేఈఈ మెయిన్స్‌లో 2,483 ర్యాంకు, అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా 1,152 ర్యాంకు సాధించి జార్ఖండ్‌లోని ధన్‌బాద్ ఐఐటీలో సీటు సంపాదించాడు. కూలీ చేస్తూ కుటుంబాన్ని పోసిస్తున్న తండ్రి బంగారాజు తన కుమారుడిని ఇతర రాష్ట్రంలో ఉన్నత చదువులు ఎలా చదివించాలో తెలియక నిస్సహాయత వ్యక్తం చేస్తున్నాడు.

మరో విద్యార్థిది అదే పరిస్థితి...

పాడేరు మండలం డి.గొందూరు పంచాయతీ మద్దులబందకు చెందిన గిరిజన విద్యార్థి జంతరంగి దారేశ్వర్ తండ్రి అప్పారావు చింతపల్లి నుంచి వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటూ కుమారుడ్ని చదివించాడు. విద్యార్థి దారేశ్వర్ డి.గొందూరు ప్రాథమిక పాఠశాలలో చదివాడు. టెన్త్ పాడేరు పట్టణంలోని తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యనభ్యసించి 453 మార్కులతో పాసయ్యాడు. మన్యం పార్వతీపురం జిల్లాలో గిరిజన గురుకుల కళాశాల (కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్)లో సీటు సంపాదించి 964 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు పొందాడు. జేఈఈ మెయిన్స్‌లో 4,826 ర్యాంకు, అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 1,442 ర్యాంకు సొంతం చేసుకున్నాడు. కర్ణాటక రాష్ట్రం ప్రఖ్యాత ధార్వాడ్ యూనివర్సిటీలో ఐఐటీ సీటు సంపాదించాడు.

రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించాలని వేడుకోలు

గిరిజన విద్యార్థులు ఐఐటీల్లో ప్రవేశం పొందేందుకు ఆర్థిక పరిస్థితి అడ్డంకిగా మారింది. ఇక తాము ఉన్నత చదువులు చదువుకునేది ఎలా అని వారిద్దరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి విద్యార్థులు ఉన్నత చదువులు కొనసాగేలా ఆర్థిక తోడ్పాటు అందించాలని డి.గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబు, గిరిజన నిరుద్యోగుల సంఘం అధ్యక్షుడు కర్జా వై కుమార్ కోరుతున్నారు.